

తాంసి : వడ్డాడిలో మొక్కనాటి నీరు పోస్తున్న బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్



ఎదులాపురం : మొక్కనాటుతున్న ఆదిలాబాద్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి



ఖానాపూర్ టౌన్ : మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేఖానాయక్

# ఊరూరా హరితోత్సవం

## ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా వేడుకలు

- పాల్గొన్న విప్ బాల్క సుమన్, జడ్పీ చైర్మన్లు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, ఎస్పీలు
- మొక్కలు నాటిన ప్రజాప్రతినిధులు, అధికారులు
- ఫ్లెక్సీలతో ర్యాలీలు.. హరితహారంపై అవగాహన
- ఆకట్టుకున్న రంగవల్లులు.. అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- ఉత్తమ సేవలందించిన వారికి ప్రశంసలు



ఆదిలాబాద్ రూరల్ : మొక్కనాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న

చెన్నూర్ రూరల్, జూన్ 19 : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన హరితోత్సవం ఉత్సాహంగా సాగింది. ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని పెద్ద సంఖ్యలో మొక్కలు నాటారు. కిష్టంపేట సమీపంలోని అంబేద్కర్ అర్బన్ పార్కులో జిల్లా ఫారెస్ట్ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన హరితోత్సవంలో విప్ బాల్క సుమన్.. మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్, కలెక్టర్ సంతోష్, అదనపు కలెక్టర్ రాహుల్‌తో కలిసి పాల్గొన్నారు. హరితోత్సవం విజయాల పోస్టర్లు, వైల్డ్ లైఫ్ ఆఫ్ చెన్నూర్ ఫారెస్ట్ బుక్కులను ఆవిష్కరించారు. ప్లాస్టిక్ కవర్లకు బదులుగా కాటన్ సంచులను తయారు చేయించి సుమన్ చేతుల మీదుగా కిష్టంపేట గ్రామస్తులకు పంపిణీ చేయించారు. ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను అందించారు. డీఎఫ్‌వో శివ్ ఆశిశ్‌సింగ్ పాల్గొన్నారు.

భీమారం, జూన్ 19 : భీమారం రేంజ్ పరిధిలో హరిత నిధి మోడల్ నర్సరీతోపాటు సీడ్ స్టోరేజ్ యూనిట్‌ను విప్ బాల్క సుమన్.. కలెక్టర్ సంతోష్, డీఎఫ్‌వో శివ్ ఆశిష్ సింగ్‌తో కలిసి ప్రారంభించారు. నర్సరీలోని మొక్కలను పరిశీలించారు. ప్రతి మొక్కనూ బతికించాలని అధికారులకు సూచించారు.

లక్షెట్టిపేట రూరల్/లక్షెట్టిపేట జూన్ 19 : సూరారంలో నిర్వహించిన హరితోత్సవంలో కలెక్టర్ బదావత్ సంతోష్ పాల్గొని మొక్కలు నాటారు. లక్షెట్టిపేట పట్టణంలోని మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాలలో స్థానిక నాయకులతో కలిసి మొక్కలు నాటారు. అదనపు కలెక్టర్ రాహుల్, డీఎఫ్‌వో శివ్ ఆశిష్ సింగ్ పాల్గొన్నారు.

బెల్లంపల్లి, జూన్ 19 : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి మొక్కలు నాటారు.

కాసిపేట, జూన్ 19 : దేవాపూర్, సోనాపూర్, గట్రావ్‌పల్లి, మద్దిమాడ గ్రామ పంచాయతీల్లో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే చిన్నయ్య పాల్గొని మొక్కలు నాటారు. ర్యాలీలో పాల్గొని హరితహారం ప్రాముఖ్యత గురించి వివరించారు.

ఆసిఫాబాద్, జూన్ 19 : జిల్లా కేంద్రంలోని అటవీశాఖ కార్యాలయ ఆవరణలో జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో జడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యేలు కోనేరు కోనప్ప, ఆత్రం సక్కు, కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు, ఎస్పీ సురేశ్‌కుమార్, అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి పాల్గొన్నారు. అడవుల సంరక్షణ కోసం పాటు పడుతున్న అటవీశాఖ అధికారులను అభినందించారు. అంతకుముందు తెలంగాణ సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో మొక్కల విశిష్టత గురించి పాటల ద్వారా అవగాహన కల్పించారు. వ్యాసరచన, ఉపన్యాస పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. జిల్లాలో అటవీశాఖ ఆధ్వర్యంలో రూపొందిస్తున్న లఘు చిత్రాన్ని ఆవిష్కరించారు. స్టాల్స్‌ను పరిశీలించారు. అనంతరం అటవీశాఖ కార్యాలయం నుంచి సుభాష్‌చంద్రబోస్, కుమ్రం భీం చౌక్‌ల మీదుగా బైక్ ర్యాలీ తీశారు.

నిర్మల్ అర్బన్, జూన్ 19 : జిల్లా కేంద్రంలోని సోఫినగర్ కాలనీలో నిర్వహించిన సంబురాల్లో జడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, నిర్మల్ మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ పాల్గొని రోడ్లకు ఇరువైపులా, డంప్ యార్డులో మొక్కలు నాటారు. జిల్లా కేంద్రంలోని అటవీ శాఖ కార్యాలయంలో ఎఫ్‌డీపీటీ శర్వానన్, జిల్లా అటవీ అధికారి సునీల్ హెరామత్, జడ్పీ చైర్ పర్సన్ విజయలక్ష్మి, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్‌తో కలిసి మొక్కలు నాటారు.

మామడ, జూన్ 19 : లింగాపూర్‌లోని పానికి వనంలో జరిగిన ఉత్సవంలో జడ్పీ చైర్ పర్సన్ విజయలక్ష్మి, కలెక్టర్ వరుణ్‌రెడ్డితో కలిసి మొక్కలు నాటారు. హరితహారం గురించి ప్రజలకు అవగాహన కల్పించారు.

ఖానాపూర్ టౌన్, జూన్ 19 : పట్టణంలోని అర్బన్ పార్క్‌లో అటవీశాఖ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే రేఖా నాయక్ పాల్గొని మొక్కలు నాటారు. అధికారులతో కలిసి సఫారీ వాహనంలో అర్బన్ పార్క్‌లో పర్యటించారు. అటవీ శాఖ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

కుంటాల, జూన్ 19 : కుంటాల మండల కేంద్రంతోపాటు దౌనెల్లి, కుంటాలపల్లెలో కనుల పండువగా ఉత్సవాలు నిర్వహించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే విఠల్ రెడ్డి మొక్కలు నాటారు.

నిర్మల్ అర్బన్, జూన్ 19 : జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయం ఆవరణలో ఎస్పీ ప్రవీణ్ కుమార్ సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. డీసీఆర్‌బీ డీఎస్పీ రవీందర్ రెడ్డి, నిర్మల్ డీఎస్పీ జీవన్ రెడ్డి, సీఐలు శ్రీనివాస్, రమేశ్, రామకృష్ణ ఉన్నారు.

తాంసి, జూన్ 19 : వడ్డాడిలో ఎమ్మెల్యే బాపురావ్ జడ్పీటీసీ రాజుతో కలిసి సంపద వనాన్ని ప్రారంభించారు. రెండెకరాల్లో 2500 మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు.

ఆదిలాబాద్ రూరల్, జూన్ 19 : ఆదిలాబాద్ యాపల్‌గూడలోని రెండో పోలీస్ బెటాలియన్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన నర్సరీని ఎమ్మెల్యే జోగు రామన్న ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. పోలీసులతో కలిసి మొక్కలు నాటారు. ఎమ్మెల్యే జోగు రామన్న మాట్లాడుతూ బెటాలియన్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, ప్రగతి పథంలో సాగేందుకు తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. మావల హరితవనం పార్కులో ఎమ్మెల్యే జోగు రామన్న కలెక్టర్ రాహుల్ రాజ్‌తో కలిసి మొక్కలు నాటారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

ఎదులాపురం, జూన్19 : జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అదనపు ఎస్పీలతో కలిసి మొక్కలు నాటారు. అలాగే స్పెషల్ బ్రాంచ్ సిబ్బందితో కలిసి స్థానిక బాలికల గురుకుల కళాశాలలో మొక్కలు నాటారు. అనంతరం జిల్లా పోలీసుల అన్ని కార్యాలయాలు, పోలీస్‌స్టేషన్‌లో మొక్కలు నాటారు.

నేరడిగొండ, జూన్ 19 : మండల కేంద్రంలో హరితోత్సవం నిర్వహించారు. బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్ బైక్ ర్యాలీ ప్రారంభించారు. నేరడిగొండ నుంచి సోమన్న అర్బన్ పార్కు వరకు ర్యాలీ సాగింది.



నిర్మల్ అర్బన్ : నీరు పోస్తున్న ఎస్పీ ప్రవీణ్ కుమార్



నిర్మల్ అర్బన్ : మొక్కనాటుతున్న జడ్పీ చైర్మన్, మున్సిపల్ చైర్మన్



కుంటాల : దౌనెల్లి అటవీ ప్రాంతంలో మొక్కనాటి నీరు పోస్తున్న ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి



నేరడిగొండ : బైక్‌ర్యాలీలో పాల్గొన్న బోథ్ ఎమ్మెల్యే బాపురావ్



ఆదిలాబాద్ రూరల్ : యాపల్‌గూడలో మొక్కలు నాటుతున్న పోలీస్ అధికారులు




సబ్బేపల్లిలో పాఠశాలకు వస్తున్న విద్యార్థులు




ఆదిలాబాద్‌లోని హమీద్‌పురలో కార్పొరేట్‌కు దీటుగా సర్కారు బడి



సబ్బేపల్లి పాఠశాలలో విద్యార్థుల చిరునవ్వులు

- ప్రభుత్వ పాఠశాలలకు కార్పొరేట్ రూపు

# సాహో సర్కారు బడి

ప్రభుత్వ పాఠశాలలకు కార్పొరేట్ హంగులు

## 'మన ఊరు-మన బడి' పథకం కింద మారిన రూపురేఖలు

- సకల హంగులతో సర్వాంగ సుందరంగా ప్రభుత్వ పాఠశాలలు
- స్వరాష్ట్రంలో కేసీఆర్ ఆధ్వర్యంలో బలోపేతమైన విద్యారంగం
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 996 స్కూళ్లకు మహర్దశ

**నేడు రాష్ట్రవ్యాప్తంగా విద్యాదినోత్సవం నిర్వహణ**

మంచిర్యాల, జూన్ 19(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి రాష్ట్రంలో మారుమూల జిల్లాగా పేరొందిన ఆదిలాబాద్‌లో విద్యా రంగాన్ని పట్టించుకున్న పాపాన పోలేదు. జిల్లాలోని పేద గిరిజనులు చదువుకుందామంటే బడి ఎక్కడుందో తెలిసేది కాదు. ఐదో తరగతి దాటి ఉన్నత పాఠశాలకు వెళ్లాలంటే కనీసం 15 కిలో మీటర్ల నుంచి 20 కిలోమీటర్లు వెళ్తే తప్పా బడి జాడ తెలిసేది కాదు. దీంతో చాలా మంది మధ్యలోనే చదువు మానేసి, పనిలోకి వెళ్లాల్సిన దుస్థితి. కానీ.. కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో విద్యా రంగానికి ప్రభుత్వం పెద్దపీట వేసింది. కొత్తగా గురుకుల పాఠశాలలు, కేజీబీవీలను ఏర్పాటు చేసింది. దీంతో నిరుపేద గిరిజన విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందుబాటులోకి వచ్చింది. వీటికి తోడు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా తొలి విడుత 'మన ఊరు- మన బడి' కార్యక్రమంలో 996 పాఠశాలలను ఎంపిక చేసింది. వీటిలో 126 పాఠశాలలను పైలెట్ ప్రాజెక్ట్‌గా తీసుకొని పనులను పూర్తి చేసింది. మొత్తంగా రూ.307.84 కోట్లతో మన ఊరు- మన బడి పనులు శరవేగంగా సాగుతున్నాయి. గడిచిన తొమ్మిదేళ్లలో ఉమ్మడి జిల్లాలో విద్యావ్యవస్థ రూపురేఖలు మారిపోయాయి. దశాబ్ది ఉత్సవాల సందర్భంగా నేడు(మంగళవారం) రాష్ట్రవ్యాప్తంగా విద్యా దినోత్సవం నిర్వహించనున్న నేపథ్యంలో జిల్లాలవారీగా తొమ్మిదేళ్లలో విద్యారంగంలో వచ్చిన విప్లవాత్మక అభివృద్ధిపై 'నమస్తే తెలంగాణ' అందిస్తున్న ప్రత్యేక కథనం.

### పెరిగిన విద్యార్థులు..

**మంచిర్యాల జిల్లాలో** 2014 తరువాత తెలంగాణ ప్రభుత్వం కొత్తగా నాలుగు గురుకులాలు, ఐదు మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాలలు, నాలుగు కేజీబీవీలను ఏర్పాటు చేసింది. వీటి ద్వారా ఇప్పటి వరకు 1,200 మంది విద్యార్థులు లబ్ధిపొందారు. 'మన ఊరు-మన బడి' పథకం కింద జిల్లాలో 248 పాఠశాలలను ఎంపిక చేశారు. ఇందులో 36 పాఠశాలల్లో 100 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన పాఠశాలల్లో పనులు జరుగుతున్నాయి. మొత్తం 1,049 బడులు ఉండగా సుమారు 1.20 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు మెరుగుపడడంతో 2014తో పోలిస్తే ప్రస్తుతం సర్కార్ స్కూళ్లలో చదువుకునే విద్యార్థుల సంఖ్య దాదాపు 5 శాతం పెరిగింది.

**నిర్మల్ జిల్లాలో** తెలంగాణ సర్కారు వచ్చాక కొత్తగా 15 గురుకుల సంక్షేమ పాఠశాలలు, ఐదు కేజీబీవీలను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా ఇప్పటివరకు 9 వేల మంది విద్యార్థులు లబ్ధి పొందారు. 'మన ఊరు-మన బడి' కింద జిల్లాలో 260 సర్కారు పాఠశాలలు ఎంపికయ్యాయి. 130 పాఠశాలల్లో 100 శాతం పనులు పూర్తయ్యాయి. గతంతో పోలిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థుల సంఖ్య దాదాపు 10 వేలకు పైగా పెరిగింది.

**ఆదిలాబాద్ జిల్లాలో** ప్రత్యేక రాష్ట్రంలో కొత్తగా ఆరు గురుకుల సంక్షేమ పాఠశాలలు, నాలుగు కేజీబీవీలను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా ఇప్పటివరకు వేలాది మంది విద్యార్థులు బెనిఫిట్ పొందారు. 'మన ఊరు-మన బడి' కింద జిల్లాలో 236 సర్కారు పాఠశాలలు ఎంపికయ్యాయి. మొత్తంగా 80 స్కూళ్లలో 100 శాతం పనులు పూర్తయ్యాయి. గతంతో పోలిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థుల సంఖ్య 9 వేలకు పైగా పెరిగింది.

**కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో** తెలంగాణ వచ్చాక జిల్లాకు కొత్తగా ఏడు గురుకులాలు, మూడు కేజీబీవీలు మంజూరయ్యాయి. ఇప్పటి వరకు వీటి ద్వారా 4 వేల మంది పిల్లలు చదువుకున్నారు. 'మన ఊరు-మన బడి' కింద 253 పాఠశాలలను ఎంపిక చేయగా, పది స్కూళ్లలో పనులు పూర్తయ్యాయి. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం తీసుకురావడంతో సుమారు 10వేల మంది విద్యార్థులు పెరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి.

### విద్యాశాఖ ఉత్తర్వులు

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులకు విద్యాశాఖ ఆహ్వాన పత్రం పంపింది. ఇందులో.. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉదయం 7 గంటలకు బడికి చేరుకోవాలని పేర్కొంది. 7.15 గంటలకు విద్యార్థులు ర్యాలీగా వెళ్లి తల్లిదండ్రులను పాఠశాలకు ఆహ్వానించాలి. ర్యాలీలో భాగంగా వీధి కూడళ్లలో విద్యకు సంబంధించిన పాటలు, నాటకాలు, డ్యాన్సులు విద్యార్థులతో చేయించాలి. ఉదయం 9 గంటలకు జెండా ఆవిష్కరణ చేయాలి. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలి.

**'మన ఊరు-మన బడి' కింద జిల్లాలవారీగా ఎంపికైన పాఠశాలలు..**

| జిల్లా | తొలి విడుత | పైలెట్ ప్రాజెక్ట్ | చేయనున్న ఖర్చు |
|---|---|---|---|
| ఆదిలాబాద్ | 237 | 37 | రూ.82 కోట్లు |
| మంచిర్యాల | 248 | 36 | రూ.109.84 కోట్లు |
| నిర్మల్ | 260 | 38 | రూ.82 కోట్లు |
| ఆసిఫాబాద్ | 251 | 15 | రూ.34 కోట్లు |
| మొత్తం | 996 | 126 | రూ.307.84 కోట్లు |





గుళ్లకోట పాఠశాల తరగతి గదిలో తల్లిదండ్రులతో విద్యార్థులు



రాజీవ్‌నగర్ పాఠశాలలో కొత్తగా ఏర్పాటు చేసిన నల్లాల వద్ద నీళ్లు తాగుతున్న విద్యార్థులు




మన ఊరు-మన బడి నిధులతో అభివృద్ధి చేసిన మంచిర్యాల జిల్లాలోని రాజీవ్‌నగర్ ప్రాథమిక పాఠశాల